ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 11.04.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
2. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను చెల్లించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.
3. మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా ఈ రోజు రాష్ట్ర ప్రజలు ఆయనకు ఘనంగా నివాళి అర్పిస్తున్నారు.
4. రాష్ట్రంలోని నేడు, రేపు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పలు జిల్లాలకు వాతావరణ శాఖ పసుపు హెచ్చరిక జారీ చేసింది.

-------------------

**పంట నష్టం-మంత్రి తుమ్మల**

రాష్ట్రంలో అకాల వర్షం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక రాగానే వారిని ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిద్దిపేట జిల్లా

చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామంలో ఇటీవల అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలను రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 24 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. అందులో సిద్దిపేట జిల్లాలో ఎక్కువ నష్టం జరిగినట్టు తెలుస్తోందని చెప్పారు.నష్టపోయిన రైతులను తప్పకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు.

**--------- బైట్ తుమ్మల నాగేశ్వరరావు ----------**

**(పీటీసీ,సిద్దిపేట)**

------------------------------

పూలే –బండి సంజయ్

మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ అప్పుల ఊభిలో పడేశాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. మహాత్మా జ్యోతిరావు పూలె జయంతిని పురస్కరించుకుని బండి సంజయ్ ఈరోజు హైదరాబాద్ లో చిత్రపటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పూలే సేవలను స్మరించుకున్నారు. పూలే ఆశయాలకు విరుద్ధంగా తెలంగాణలో పాలన సాగుతోందని మంత్రి విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే చదువుకునే ప్రతి విద్యార్థికి 5 లక్షల రూపాయల భరోసా కార్డు ఇస్తామని, ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్

వాటిని గాలికొదిలేసిందని అన్నారు.  ఏళ్ల తరబడి ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమైతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ వంద శాతం అక్షరాస్యత దిశగా క్రుషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కోరారు.

**(పీఎస్)**

---------------------------------

**Jyothiba Phule:**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికోసం అహరహం కృషి చేసిన మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా ఈ రోజు రాష్ట్ర ప్రజలు ఆయనకు ఘనంగా నివాళి అర్పిస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆయన సేవలను గుర్తు చేసుకుని, మహాత్మా ఫూలే కు ఘనంగా నివాళి అర్పిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్, అంబర్ పేట్ లోని  మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. PCC అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్లమెంటు సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్ కుమార్ యాదవ్, పలువురు  శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, నగర మేయర్ విజయలక్ష్మి సహా పలువురు నాయకులు, అధికారులు హాజరయ్యారు. అంతకు ముందు, హైదరాబాద్ నెక్లెస్ రోడ్ ఐమాక్స్ సమీపంలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి స్థలాన్ని

పరిశీలించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా హాజరయ్యారుయి. స్థల సర్వే చేసి పూర్తి స్థాయి ప్రణాళికలతో నివేదికను అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా విగ్రహ ఏర్పాటుకు డిజైనింగ్ చేయాలని సూచించారు. శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, BRS అధ్యక్షులు, శాసనసభ ప్రతిపక్ష నేత K చంద్రశేఖర రావు, ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు B మహేశ్ కుమార్ గౌడ్, BJP రాజ్యసభ సభ్యులు Dr K లక్ష్మణ్, మహాత్మా పూలే కు నివాళి అర్పించారు.

**(MSL)**

---------------------------

**పూలే-మంత్రులు, ప్రజాప్రతినిధులు**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ హనుమకొండలో పూలే విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పాల్గొన్నారు.

**(పీటీసీ, సంగారెడ్డి/ వరంగల్/సిరిసిల్ల/ ఆసిఫాబాద్/ నల్లగొండ/ కరీంనగర్/ వనపర్తి)**

---------------------------

**తెలుగు భాష-వెంకయ్య నాయుడు**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ స్థాయిలో ద్వితీయ భాషగా సంస్కృతం అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పునరాలోచన చేయాలని సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టు ద్వారా ప్రభుత్వానికి సూచించారు. విద్యార్థులను మాతృభాషకు దూరం చేయడం మంచిది కాదని, జాతీయ విద్యావిధానం - 2020 సైతం మాతృభాషకు ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు.

**(డెస్క్)**

-------------------------

కేటీఆర్-గచ్చిబౌలి

రంగారెడ్డి జిల్లాలోని కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములతో రాష్ట్ర ప్రభుత్వం 10 వేల కోట్ల రూపాయల కుంభకోణానికి ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఈ రోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీకి చెందిన ఓ ఎంపీ సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇందుకోసం ఓ బ్రోకరేజ్ కంపెనీతో సంప్రదింపులు జరిపారని ఆరోపించారు. ఎఫ్ఆర్బీఎం నిబంధనలను పక్కనబెట్టి రుణాలు ఇస్తామని ఆ తర్వాత భూములు అమ్ముకోవచ్చని ఆ కంపెనీ తెలిపిందన్నారు. దీనికోసం అన్ని

చట్టాలు, సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్‌బీఐ నిబంధనలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఈ విషయంలో నిర్దిష్టమైన ఆధారాలతో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు చెప్పారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

**(డెస్క్)**

------------------------------

**టన్నెల్-సహాయ కార్యక్రమాలు**

**నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్** మండలం దోమలపెంట గ్రామంలో శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలోని ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు చేపడుతున్న సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు, సొరంగం ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ రోజు సొరంగం వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నిపుణుల సమన్వయంతో, అత్యాధునిక సాంకేతిక పద్ధతులను వినియోగిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

**(పీఎస్)**

----------------------------

**జోగులంబ గద్వాల జిల్లా- పోషణ్ పక్వాడా**

జోగులాంబ గద్వాల జిలాలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడానికి, పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల అంగన్ వాడి

కేంద్రాల లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం గురించి జిల్లా సంక్షేమ అధికారిణి డి.సునంద ఆకాశవాణికి వివరించారు.

**(సౌండ్ బైట్ : డి. సునంద)**

(పీటీసీ/**జోగులంబ గద్వాల**)

-------------------------

**ముద్రా యోజన పథకం-నిర్మల్**

కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం ద్వారా నిర్మల్ జిల్లాలో పలువురు సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ స్వయం సమ్రుద్ధి సాధిస్తున్నారు. ఈ పథకం కింద బ్యాంకు ద్వారా రుణం తీసుకొని హోటల్ నిర్వహిస్తున్నానని లబ్దిదారుడు సంజీవ్ ఆకాశవాణికి తెలిపారు.

**( బైట్ లబ్దిదారుడు సంజీవ్)**

**(పిటిసి నిర్మల్ జిల్లా)**

----------------------------

**పిడుగు- రైతు మ్రుతి**

జనగామ జిల్లాలో నిన్న రాత్రి పిడుగు పాటు వల్ల ఓ రైతు మ్రుతి చెందారు. లింగాల గణపురం మండ లం నేల పోగుల గ్రామానికి చెందిన రైతు మందాడి రవీందర్ రెడ్డి పై పిడుగు పడడం వల్ల ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామంలో పిడుగుపాటుకు మూడు పశువులు మృత్యువాత పడ్డాయి. వడగళ్లతో కురిసిన వర్షం తో జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు.

**(జనగామ, పీటీసీ)**

--------------------------

**జనగామ-కడియం శ్రీహరి**

రైతులకు అండగా ఉంటూ, వారికి ఆర్థికంగా తోడ్పాటు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జిల్లాలోని చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ రోజు ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు.

**(పిటిసి జనగామ జిల్లా)**

----------------------------

**వాతావరణం**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నేడు, రేపు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ రోజు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు పసుపు హెచ్చరిక జారీ చేసింది. నేడు గరిష్ఠ ఉష్ణోగ్రతలో పెద్దగా మార్పు లేదని, రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

**(డెస్క్)**

---------------------

**భద్రాచలం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారాముల కళ్యాణం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు వసంతోత్సవం నిర్వహించారు. తాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ సూర్యప్రభ వాహనంలో భద్రాద్రి రాముడిని రాజవీధిలో ఊరేగింపుగా తీసుకెళ్ళారు.

**(PTC- B.KGM)**

-----------------------

**సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు**

నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని నల్లమల అడవిలోని లోయలో వెలసిన సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. దక్షిణ భారత అమర్ నాథ్ యాత్రగా పరిగణించే ఈ ఉత్సవాల్లో చెంచులే పూజారులుగా వ్యవహరించడం ప్రత్యేకత. లింగమయ్యగా పిలుచుకునే శివుడిని దర్శించుకునేందుకు భక్తులు చేతిలో కర్రలను పట్టుకొని దాదాపు వేయి అడుగుల లోతులో ఉన్న లోయలోకి దిగుతారు. ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహిస్తోంది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక నుంచి వేలాదిగా వచ్చేభక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

**(PTC నాగర్‌కర్నూల్)**

-------------------------

**జగిత్యాల -చిన్న హనుమాన్ జయంతి**

జగిత్యాల జిల్లా- కొండగట్టులో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి 3 రోజులపాటు జరగనున్న

ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.

**(పీటీసీ, జగిత్యాల)**

---------------------------

**నల్లగొండ-బస్తీ దవఖానా**

నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ఏరియా ఆసుపత్రి, ఇతర ఆసుపత్రులలో వైద్య సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవఖానను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. బస్తీ దవాఖానలో వైద్యం తో పాటు లాబ్, ఫార్మసీ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

**(పిటిసి నల్లగొండ)**

-------------------------------